క్లుప్తంగా

సమయం వృథా చేసుకోవద్దు: జడ్జి రేవతి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రేవతి

హుస్నాబాద్: కక్షిదారులు చిన్నచిన్న కేసులతో తమ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రేవతి సూచించారు. కోర్టు హాల్‌లో పోలీస్ అధికారులతో శుక్రవారం లోక్ అదాలత్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీ పడే కేసులను గుర్తించి పరిష్కరించాలని, అధిక మొత్తంలో కేసులు రాజీ కుదుర్చాలని సూచించారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రమీద, ఏపీపీ నాగరాజు, స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ జడ్జి రాజశేఖర్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు చిత్తారి హనుమయ్య, జుమ్లా నాయక్, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

న్యాయమూర్తి తనిఖీ



నిల్వ పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి సంతోష్ కుమార్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని శుక్రవారం అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ సంతోష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి చట్టాలు, హక్కులు గురించి వివరించారు. సమస్యలు ఉంటే లీగల్ సెల్ అథారిటీని సంప్రదించాలని సూచించారు. అనంతరం భోజన నాణ్యత పరిశీలించారు. వంటగది, పరిసరాలు, ఆహార పదార్థాలను పరిశీలించి, హాజరు పట్టిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రతిభ, సిబ్బంది రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌కు వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని బిజివెంకటాపూర్ నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో శుక్రవారం కలిశారు. గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పనుల కోసం ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, పరమేశ్, వెంకటేశ్, నందు, రూపేశ్, సురేందర్, వేణు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

తొగుట(దుబ్బాక): దాతల అందించిన సహకారాన్ని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కాన్గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మధు విద్యార్థులకు సూచించారు. సామాజిక సమరసత వేదిక, చేతన గ్రామీణ వికాస్ సేవా సమితి, యూత్ ఫర్ సేవా సంస్థల సహకారంతో 60 మంది అనాథ, పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. దాతలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పోశయ్య, సంతోష్ కుమార్, కనకరాజ్, పరశురాములు, సాయి కుమార్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి ఓపెన్ పరీక్షలు

– డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్ పరీక్షలు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 13 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సెప్టెంబర్ 22 నుంచి థియరీ, అక్టోబర్ 6 నుంచి 13 వరకు ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయని, మరిన్ని వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి (8008403635)ని సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఖాళీలు ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని చెప్పారు.



నిండుకుండలా మారి మత్తడి దూకుతున్న ఎన్సాన్‌పల్లి చెరువు



దుబ్బాకరూరల్: ఆకారం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద



కోమటిచెరువు తీగల వంతెనను తాకుతున్న వరదనీరు



కోమటిచెరువు వద్ద యువతుల సెల్ఫీలు

చెరువులు, కుంటల్లో జలకళ

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం వరద ఉధృతి తగ్గడంతో చెరువులు, పర్యటక ప్రాంతాల వద్ద సందర్శకుల సందడి నెలకొంది. మరోవైపు వరద నీటిలో వరి, పత్తి పంటలు మునిగిపోయాయి. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిచెరువు, కోమటిచెరువు ట్యాంక్‌బండ్ నిండుకుండల్లా మారగా.. తీగల వంతెన తేలియాడుతున్నట్లు కనువిందు చేసింది. యవకులు చేపల వేటలో నిమగ్నమయ్యారు. పర్యాటకులు సెల్ఫీలతో సందడి చేశారు. తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరువు, నంగునూరు మండలం ముండ్రాయిలోని మెరుపుకుంటకు పడిన గండ్లు, బెజ్జంకి మండలం గూడెంలో ధ్వంసమైన మైసమ్మకుంట చెరువు కట్టను అధికారులు పరిశీలించి పూడ్చించారు. – సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



నర్సపూర్‌చెరువు మత్తడిలో చేపలు పడుతున్న యువకులు



నంగునూరు(సిద్దిపేట): గండిపూడ్చిస్తున్న తహసీల్దార్ సరిత, జేఈఈ రాజు



తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరువుకు పడిన గండి



బెజ్జంకి(సిద్దిపేట): గూడెం చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ అంజయ్య



తొగుటలోని పెద్ద మాసాన్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



మైలారంలో వరదనీటిలో మునిగిన వరి పంట

రైతును ముంచిన వాన

వర్గల్(గజ్వేల్): భారీ వర్షాలు వర్గల్ మండల రైతులను నష్టాల్లోకి నెట్టేశాయి. జిల్లాలోనే అత్యధిక స్థాయిలో వరి పంట నీటిలో మునిగింది. పత్తి, మొక్కజొన్న తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 6,000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా వర్గల్ మండలంలోనే 3,392 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బుధ, గురువారాల్లో వరుసగా 61.4 మిల్లీమీటర్లు, 106.8 మిల్లీమీటర్ల భారీవర్షం మరోసారి అతలాకుతలం చేసింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక లెక్కల ప్రకారం వర్షాల తాకిడికి జిల్లాలో ఆరు వేల ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నాయి. అందులో అత్యధికంగా వర్గల్ మండలంలో 989 మంది రైతులకు సంబంధించిన 3,392 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. అందులో అత్యధికంగా 702 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది.

ప్రజలకు రక్షణగా సీసీ కెమెరాలు

ఏసీపీ సదానందం

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామాల్లో ప్రజలకు రక్షణగా సీసీ కెమెరాలు పనిచేస్తాయని ఏసీపీ సదానందం అన్నారు. మండలంలోని బస్వాపూర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దాతల సహయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు అందరూ ముందుకు రావాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిచారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అభిలాష్ ఉన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

కోహెడ(హుస్నాబాద్): వార్షిక తనిఖీలలో భాగంగా ఏసీపీ సదానందం కోహెడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. బాధితులకు తక్షణ న్యాయం చేయాలని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో ముందస్తు కార్యచరణతో సిద్ధం కావాలని కోరారు. ఏఎస్‌ఐలు తిలక్, బాలగంగాధర్, కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కోహెడ పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఏసీపీ సదానందం

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ పాలెపు శ్రీనివాస్ కోరారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వినాయక మండప నిర్వాహకులతో శుక్రవారం ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాహకులు మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ కీర్తిరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువే ముద్దు.. సోషల్ మీడియా వద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణారెడ్డి సూచించారు. జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ స్లీవరాజ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

అవగాహన పెంచుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని, అదేవిధంగా ప్రతి ఒక్కరికీ నూతన చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ సైఫ్ అలీ సూచించారు. మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, చిన్న పిల్లల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుకునే వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు. ఏఎస్‌ఐ కిషన్, హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ యువశక్తిదే..

ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేటజోన్: ఈ దేశ భవిష్యత్ యువశక్తిదేనని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హైమావతితో కలిసి ఆయన క్రీడాజ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం, మంచి భవిష్యత్ కోసం కేంద్ర ప్రభుత్వం ఫిట్ ఇండియా పేరిట కొత్త కార్యక్రమం చేపట్టనుందన్నారు. సెప్టెంబర్ 25న దేశ వ్యాప్తంగా ఎనిమిది క్రీడా అంశాల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. పిల్లలను తరగతి గదులకు పరిమితం చేయకుండా క్రీడల వైపు ఆసక్తి పెంచేలా చేయాలన్నారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్ నర్సయ్య, క్రీడా సమాఖ్య కన్వీనర్ సాయిరాం, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ హైమావతి తదితరులు

కనీస వేతనాలు అమలు కావడం లేదు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు కావడం లేదని, కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలని కోరుతూ గజ్వేల్ ఐఓసీలో లేబర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్మికశాఖ అధికారి జ్యోతికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని పరిశ్రమల్లో 12గంటల పనివిధానం అమలవుతుందన్నారు. కార్మికశాఖ, ఫ్యాక్టరీ తనిఖీల శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. నాయకులు స్వామి, రంగారెడ్డి, మల్లేశ్, రాజు, వెంకట్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కట్టుబడి ఉంది

పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేటరూరల్: ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ముస్లింలకు తంజీం కోసం భూమి కేటాయించాలని మంత్రి వివేక్ ఎండార్స్ చేసిన పత్రాన్ని కలెక్టర్ కె.హైమావతికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల నుంచి ముస్లింలకు శ్మశానవాటిక కావాలని అడిగినప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముస్లింలు ఏ పార్టీలో ఉన్నా వారి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ముస్లింల స్మశానవాటికకు అయిదెకరాల స్థలం కేటాయించాలని మంత్రి వివేక్‌ను కోరగానే స్థలం కేటాయించాలని కలెక్టర్ హైమావతికి ఆయన సూచించారన్నారు. స్మశానవాటిక కోసం సహకరించిన మంత్రి వివేక్, హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. వహాబ్, రాషద్ గయాజొద్దీన్, అజ్మత్, నజ్జు, చోటా అజ్మత్, మధు తదితరులు పాల్గొన్నారు.

'గిడుగు' సేవలు మరువలేనివి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు మరువలేనివని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నవెళ్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం కొనియాడారు. జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కవులు, రచయితలు పాల్గొన్నారు.

గ్రీన్ చానెల్ ద్వారా జీతాలివ్వాలి

సిద్దిపేటరూరల్: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 5వ తేదీలోపు గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు అందించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్ మాట్లాడారు. గ్రీన్ చానెల్ ద్వారా రూ.26 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో బాల్‌నర్సయ్య, ప్రభాకర్, కనకయ్య, రాజమౌళి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు



గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హ్యాండ్‌బుక్ ఆవిష్కరిస్తున్న నాగరాజు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం సాధించి ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు శుక్రవారం నిర్వహించిన ఒరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు తాము ఎంచుకున్న రంగం దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగినప్పుడే విజయం వరిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించి విద్యార్థినులకు అందజేశారు. అదే విధంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనితా అబ్రహం మాట్లాడుతూ గ్రాంథిక భాషా రూపంలో ఉన్న తెలుగును వ్యవహారిక భాషలోకి మార్చిన ఘనత గిడుగు రామ్మూర్తికే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారణమైన ఆస్పత్రి సీజ్

కుకునూరుపల్లిలో రెండు డెంగీ కేసులు నమోదు



జిల్లా వైద్యాధికారి ధన్‌రాజు సీజ్ చేసిన ప్రైవేటు ఆస్పత్రి

కొండపాక(గజ్వేల్): ఓ ప్రైవేటు ఆస్పత్రిని శుక్రవారం జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సీజ్ చేశారు. కుకునూరుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆయన, మండల ప్రత్యేకాధికారి స్వరూపరాణి శుక్రవారం వేర్వేరుగా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి నిర్వహణ తీరు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పారంలో కీర్తి(7), కొండకండ్లలో హర్షవర్ధన్(7) డెంగీ వ్యాధికి గురవ్వడంతో ఆర్వీఎం, గజ్వేల్ తదితర పట్టణాల్లోని ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి యశ్వంత్ డెంగీ లక్షణాలతో శుక్రవారం మృతి చెందాడు. కాగా ఆస్పత్రికి వచ్చిన యశ్వంత్‌కు కుకునూరుపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యుడు సుదర్శన్ వైద్యం చేయడంతో ఆస్పత్రిని సీజ్ చేసినట్లు ధన్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ... అత్యవసర సమయంలో వైద్యం కోసం ప్రజలు ఆర్‌ఎంపీ వైద్యులను సంప్రదించగా ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. కానీ వైద్య సేవలు అందించడం సరికాదన్నారు. వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు ఫర్వీనా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



విద్యార్థులకు క్రీడాదుస్తులు అందిస్తున్న ఎంఈఓ గౌరీమోహన్ తదితరులు

సిద్దిపేటరూరల్/దుబ్బాకటౌన్/ చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సిద్దిపేటరూరల్ మండల విద్యాశాఖ అధికారి గౌరీమోహన్ అన్నారు. నారాయణరావుపేట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నాగరాజు అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, రూ.15 వేలు విలువైన క్రీడా దుస్తులను పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తోట సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దుబ్బాక మైనార్టీ కళాశాల, పాఠశాలలో ప్రిన్సిపాల్ విమలరెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ధ్యాన్‌చంద్‌ని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 100 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. డిప్యూటీ వార్డెన్ హమీద్, పీడీ షాదుల్, మానస తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం సతీశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. పీడీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మాతృభాష, జాతీయ క్రీడల వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మాలతి, మాధవిని సన్మానించారు. క్లబ్ ప్రతినిధులు సత్యం, బాబాయిమాత, డాక్టర్ జానకి రాములు పాల్గొన్నారు.